
భోగి మంటలు, గంగిరెద్దులతో వేడుకలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


భోగి మంటలు వేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు


నాగులుప్పలపాడు : భోగి మంటలు వేస్తున్న యువత, పెద్దలు

వైభవంగా భోగి సంబరాలు

- పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి పండుగ జరుపుకున్న ప్రజలు
- చీమకుర్తిలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: భోగి పండుగ వేడుకలను సోమవారం వేకువజాము నుంచే ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి గంగిరెద్దుల ఆటలతో ఉత్సాహంగా గడిపారు. ప్రతి ఇంటి ముందు కుటుంబ సభ్యులంతా కలిసి భోగి మంటలు వేశారు. చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వారి కుటుంబ సభ్యులు కలిసి భోగి మంటలు వేసి గంగిరెద్దులకు స్వాగతం పలికారు. సంక్రాంతి పండుగ వేడుకలను ఇంటిల్లిపాదీ ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. చీమకుర్తి బస్టాండ్ సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గోదాదేవి కళ్యాణోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. టీటీడీ వేదపండితుడు పరాంకుశం సాయికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీమకుర్తి గాంధీనగర్‌లో స్థానికులు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

110 సంవత్సరాలలో ప్రత్యేక దినం...

పుష్యమాసం, ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి కలిసిన ప్రత్యేక దినం కావడంతో సోమవారం వంటి ప్రత్యేక రోజు 110 సంవత్సరాలకు ఒకసారి వస్తుందని చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈ రోజుకున్న ప్రాధాన్యతను బట్టి అర్చకుడు రాఘవేంద్రశర్మ భక్తులకు స్వామివారి ఆశీర్వాదాలు అందించారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: మండలంలో సోమవారం ఇంటింటా భోగి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులో భారీగా భోగి మంటలు వేశారు. వేకువజాము నుంచే ప్రజలు ఇంటి ముందు భోగి మంటలు వేసి ముగ్గులతో ఇంటి ముంగిళ్లను అలంకరించారు. చిన్నారులు, మహిళలు ఆనందోత్సాహాలతో సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ జరుపుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు చెన్నై, తదితర దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని తొలిరోజు భోగి వేడుకలను నాగులుప్పలపాడు మండలంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే పిల్లలు, పెద్దలు ఆనందంగా భోగి మంటలు వేశారు. మండలంలోని అన్ని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలో భోగి సంబరాలు అంబరాన్ని అంటాయి. మండల ప్రజలు సోమవారం వేకువజాము నుంచే పల్లెల్లో, తీర పాంత గ్రామాల్లో ఇళ్ల ముందు భోగి మంటలు వేసి చిన్నాపెద్దా తేడా లేకుండా చలికాచుకుంటూ ఆనందంగా గడిపారు. కొన్ని గ్రామాల్లో కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భోగి మంటల ముందు చిన్నారులకు భోగి పండ్లు పోసి పెద్దలు సంప్రదాయబద్ధంగా పండుగ జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా పలు దేవాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భోగి మంటల్లో కాచిన వేడి నీటితో ఆనవాయితీగా తలంటు స్నానం చేశారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, అధిక సంఖ్యలో పాల్గొని పోటీపడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా పలు దేవాలయాలను విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. భక్తులు భారీగా ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు.


చీమకుర్తి : సాక్షి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు

శిద్దా ఇంట భోగి వేడుకలు...

ఒంగోలు సిటీ: స్థానిక లాయర్‌పేటలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. మన్యం ఫణికుమార్ దంపతులు సంప్రదాయ పద్ధతిలో భోగి మంటలు వేసి అగ్ని దేవునికి, సూర్య భగవానునికి నమస్కారం చేసుకున్నారు. గంగిరెద్దులకు వస్త్రాలు సమర్పించారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



చీమకుర్తిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణోత్సవం, పాల్గొన్న భక్తులు



చీమకుర్తిలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులిస్తున్న మారం వెంకారెడ్డి


లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ సంబరాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు


సంతనూతలపాడులో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

అలరించిన జ్యోతిర్మయి అన్నమాచార్య సంకీర్తనలు


వివిధ దేవతల వేషధారణలో పాల్గొన్న విద్యార్థులతో జ్యోతిర్మయి

ఒంగోలు మెట్రో: సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక మినీ స్టేడియంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనల కార్యక్రమం అలరించింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వెంకటేశ్వరస్వామి ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి పాల్గొని వెంకటేశ్వర స్వామిని శ్రుతిస్తూ పలు సంకీర్తనలు ఆలపించగా, విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

నాగులుప్పలపాడు: లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మధ్యాహ్నం నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు సమీపంలో చోటుచేసుకుంది. మండలంలోని చవటపాలెం గ్రామానికి చెందిన నార్నే సురేష్ అనే యువకుడు 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి మాచవరం వెళ్లే క్రమంలో మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో సురేష్‌కు తలపగిలి తీవ్రగాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు వెంటనే స్పందించి బాధితుడిని 108 వాహనంలో ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు.


సంఘటన స్థలంలో గాయాలతో యువకుడు

శాస్త్రోక్తంగా గోదాదేవి పరిణయోత్సవం


సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో గోదారంగనాయకుల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పురోహితులు దక్షిణామూర్తి


కేవీ అగ్రహారంలో గోదాతిరు కళ్యాణ మహోత్సవం..

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానం అల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక గాంధీరోడ్డులోని గీతా మందిరంలో 30 రోజుల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుచే నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసాయి. అనంతరం గోదారంగనాథుల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలోని వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రముఖ వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో గోదాదేవి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పీవీఆర్ గరల్స్ హైస్కూల్ దగ్గర ఘడియారంవారివీధిలో సీతా సమేత అనంత కోదండరామ స్వామి మందిరంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు ఘడియారం సుబ్బయ్య నిర్వహణలో అర్చక స్వాములు గోదాదేవి పరిణయ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాంధీ రోడ్డు, గద్దలగుంట, నగరంలోని వివిధ వైష్ణవాలయాలలో గోదా రంగనాయకుల కళ్యాణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా సోమవారం గోదాతిరు కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, రామానుజాచార్యులు కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. జీర్ణోద్ధరణ కైంకర్య దాతలు శిద్దా వెంకట్రావు, హైమావతి కుమారులు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా సూర్యప్రకాష్, శిద్దా హనుమంతరావు, శిద్దా నాగసత్యభరత్ దంపతులు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం పక్కనే ఉన్న శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, స్వామివారి ఊంజల సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోదాదేవి కళ్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సంతనూతలపాడు:

మండల కేంద్రంలోని జెండా చెట్టు వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల ఉత్సాహంగా సాగాయి. పిల్లలకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు కూడా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో 25 మంది యువతులు పాల్గొన్నారు. మొదటి నాలుగు బహుమతులను జ్యోత్స్న జ్ఞానేశ్వరి, నల్లగట్ల రేష్మిత, దుంప అశ్విని, కీర్తి మౌనిక గెలుచుకున్నారు. పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులను కనుమ నాడు పంపిణీ చేయనున్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వేమూరు నాగమణి, తెళ్ల విల్సన్, ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణారెడ్డి వ్యవహరించారు. ముగ్గుల పోటీలకు దుంపా అజయ్ కుమార్ రెడ్డి, దుంపా మౌనిక అధ్యక్షత వహించారు. సంక్రాంతి రోజైన నేడు కూడా వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కనుమ రోజు బహుమతుల పంపిణీతో పాటు కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యూత్ నిర్వాహకులు తెలిపారు.

ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో...

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండల కేంద్రంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పాల్గొని ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు చేతికొచ్చే దశలో వచ్చే సంక్రాంతి పండుగను ప్రజలందరూ కులమతాలకు అతీతంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ప్రజల మధ్య పాలకులు చిచ్చుపెట్టాలని ప్రయత్నం చేసినా ఇటువంటి పండుగలు ప్రజల్ని ఐకమత్యం వైపు, సామరస్యం వైపు నిలబెడతాయని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి, జిల్లా నాయకురాలు ఎస్.కె.నాగూర్‌బీ, జేవీవీ నాయకుడు కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు పి.శ్రీమన్నారాయణ, కే శ్యామ్, ఎం.సుబ్రహ్మణ్యం, కే బుజ్జి తదితరులు పాల్గొన్నారు

సంతోషం వెల్లివిరియాలి

- సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున


మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు: భోగ భాగ్యాల భోగి.. సుఖ సంతోషాల సంక్రాంతి.. కమ్మని వంట కనుమ కలబోసి అందరి ఇంటా ఆనందం వెల్లివిరియాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక మకర సంక్రాంతి అని తెలిపారు. పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్లు శుభాలకు, సుఖసంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి మన దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా మేరుగు నాగార్జున గుర్తు చేశారు.

హిల్‌సిటీలో పతంగుల పండుగ


హిల్‌సిటీలో కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు గరికపాటి


హిల్ సిటీలో కైట్స్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్న యువత

- సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు గరికపాటి

ఒంగోలు టౌన్: స్థానిక పేర్నమిట్టలోని హిల్‌సిటీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం కైట్ ఫెస్టివల్ ఏర్పాటు చేయగా, స్థానికులతో పాటు విదేశాల నుంచి తరలివచ్చిన తెలుగు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు, యువత, మహిళలు కేరింతలు కొడుతూ రంగురంగుల గాలిపటాలు ఎగురవేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను తెలియజేస్తూ మహిళలు ముగ్గులు వేశారు. నింగిలో రంగురంగుల గాలిపటాలు, నేల మీద రంగురంగుల ముగ్గులు అలరించాయి. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన ఎడ్ల బండి, బొమ్మల కొలువు ఆకట్టుకున్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు గరికపాటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలివ్వాలి


మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

చీమకుర్తి: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం చీమకుర్తి వచ్చిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీలకు రూ.1,878 కోట్లతో సబ్సిడీ యూనిట్లు అందిస్తున్నారని, దళితులను మాత్రం ప్రభుత్వం వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు నిధులు కేటాయించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నీలం వెంట మక్కెన వరకుమార్, కాకుమాను రవి, తదితరులు పాల్గొన్నారు.